క్లుప్తంగా

24న సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలు



కబడ్డీ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల జట్ల ఎంపికలు ఈనెల 24వ తేదీన జరగనున్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ శ్రీకాకుళం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్ష, కార్యదర్శులు నక్క కృష్ణారావు, సాదు ముసలినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మొదలవుతాయని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే పురుషులు 85 కేజీలు, మహిళలు 75 కేజీల లోపు ఉండాలని స్పష్టం చేశారు.

ఇక్కడ ఎంపికైతే రాష్ట్ర పోటీలకు..

ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతనూతలపాడు వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్–24 పోటీలకు పంపించనున్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరవ్వాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94419 14214 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నగరంలో ఇలిసిపురంలోని యువత, ప్రజలకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. గంజాయికు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

ఎచ్చెర్ల క్యాంపస్: పోక్సో కేసులో కొయ్యాం పంచాయతీ కొత్తవానిపేటకు చెందిన ఒక యువకుడిని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద సోమవారం అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఇవ్వడంతో సబ్‌జైల్‌కు తరలించారు. అక్టోబర్ 5వ తేదీన బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

అపార్ కష్టాలు..!

- పుట్టిన తేదీ, పేర్లలో పేరుకుపోయిన తప్పులు
- కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- వ్యయ ప్రయాసలకు గురవుతున్న తల్లిదండ్రులు



మున్సిపల్ కార్యాయం వద్ద బారులుతీరిన తల్లిదండ్రులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ ఉండాలనే నినాదంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న ప్రతీ విద్యార్థికి ఒక నంబర్ కేటాయించడానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో కార్డుల జారీకి విద్యార్థుల వివరాల నమోదు ప్రారంభించింది. ఈ ప్రక్రియను పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల్లో యాజమాన్యాలకు అప్పగించింది. అపార్ నమోదు కోసం విద్యార్థి, తల్లి, తండ్రి ఆధార్ కార్డులను పాఠశాల, జూనియర్ కళాశాలల స్థాయిలో మ్యాపింగ్ చేయాలి. గత నెల రోజులుగా పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్, నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించి, విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేస్తున్నారు. అయితే విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాలల రికార్డుల్లో, ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, పేర్లు ఒకే రకంగా ఉంటేనే నమోదవుతుంది. కొందరు విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, కొంతమంది పేర్లు ఆధార్ కార్డుల్లో ఒక విధంగా, పాఠశాలల రికార్డుల్లో మరో విధంగా ఉండడం, తల్లిదండ్రుల పేర్లు కూడా స్కూళ్ల రికార్డుల్లో ఒకలా, ఆధార్ కార్డుల్లో ఒక విధంగా ఉండడంతో అపార్ నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేర్ల విషయంలో ఇంగ్లిష్ అక్షరాల్లో ఒక్క అక్షరం తప్పుగా ఉన్నా ఈ నమోదు నిలిచిపోతోంది. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న విద్యార్థి వివరాలకు సమానంగా ఆధార్‌లోని విద్యార్థి వివరాలు సరిపోల్చి ఉండాలి. జూనియర్ కళాశాల విద్యార్థులకు పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ ఆధారంగా నమోదు చేస్తుండడంతో వారి విషయంలో పెద్ద సమస్యలు లేవు. విద్యార్థులు జనన తేదీలు పాఠశాలల్లో ఉన్న విధంగా ఆధార్ కార్డుల్లో లేకుంటే వాటిని ఆధార్ కార్డుల్లో సరిచేయాల్సి వస్తోంది.

కార్పొరేషన్ పరిధిలో...

శ్రీకాకుళం నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పుట్టినవారు జిల్లాలో ఏ మండలానికి చెందినవారైనా, ఇతర జిల్లా వాసులైనా ఈ జిల్లా కేంద్రంలో పుట్టినవారికి జనన ధ్రువీకరణ పత్రాలు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అందిస్తారు. అంతేకాకుండా అప్పట్లో అవగాహన లేక చాలా మంది జనన ధ్రువీకరణ పత్రాలు పూర్తిగా తీసుకోలేదు. దీంతో వారంతా ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. 2006 నుంచి ఇప్పటివరకు పుట్టినవారంతా అందులో 2016 తర్వాత రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో పుట్టినవారికి ఆస్పత్రిలోనే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. కాబట్టి వారికి ఎటువంటి ఇబ్బంది లేదు.

ప్రత్యేక కౌంటర్లు

అపార్ నమోదు కార్యక్రమం ప్రారంభమై దాదాపుగా 20 రోజులు దాటిపోయింది. గత 15 రోజుల నుంచి తప్పుల సవరణకు శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు 700 మంది సర్టిఫికెట్లు తప్పులు సరిదిద్ది ఇచ్చారు. రోజుకి వందల్లో దరఖాస్తులు వస్తుంటే సవరణ చేసి పదుల సంఖ్యలో ఇస్తున్నారు. అధికంగా మరో రెండు మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం ఉండదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వ్యయ ప్రయాసలు పడుతున్నాం



మా పిల్లల ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉందని స్కూల్‌లో చెప్పారు. అప్పటి నుంచి ప్రతిరోజూ టెన్షన్ పడుతున్నాం. ఆఖరు తేదీ అయిపోతోంది. అవ్వకపోతే మరేమి చేయలేమని టీచర్లు పిల్లలకు ప్రతిరోజు హెచ్చరిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక నాలుగైదు రోజులుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం.

– పంకు రామారావు, అచ్చిపోలువలస, పొందూరు మండలం

గ్రామాల్లోనే కౌంటర్లు ఉండాలి



పిల్లల పుట్టిన సర్టిఫికెట్లలో ఏమి తప్పులున్నాయో తెలియడం లేదు. తేదీ, ఇంటిపేరు మార్చాలని ప్రతిరోజూ చెబుతున్నారు. దీంతో శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయానికి వచ్చాం. చాలా దూరం నుంచి వచ్చినా, పని జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి. మా గ్రామాల్లోని సచివాలయాల్లోనే ఈ అవకాశం కల్పిస్తే చాలా బాగుంటుంది.

– కొయ్యాన కళావతి, పెద్ద కోదూరు, పోలాకి మండలం

ఏర్పాట్లు చేశాం



జనన ధ్రువీకరపత్రాల కోసం, అందులో తప్పుల సవరణ కోసం అధికంగానే ప్రజలు వస్తున్నారు. అందుకు తగినట్లుగా కంప్యూటర్ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. వచ్చినవారందరికీ సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు తప్పులు సవరించి వెంటనే పంపిస్తున్నాం.

– పి.వి.వి.డి.ప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

వృథాగా తాగునీరు



ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామం ప్రారంభంలో ఉన్న బీసీ కాలనీలో జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటికి ప్రతిరోజూ ఉదయం నీటిని విడిచిపెడుతున్నారు. అయితే కొన్ని కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయలేదు. దీంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువలన అధికారులు స్పందించి ట్యాపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పందుల సంచారం



శ్రీకాకుళంలోని సాయినగర్ సిద్ధిపేట మెయిన్ రోడ్ చాపురం –1 సచివాలయం పరిధి కాలనీల్లో పందుల సంచారం ఎక్కువయ్యింది. ఇక్కడ గత కొన్ని రోజులుగా నిల్వ ఉండిపోయిన చెత్తను తీయకపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక యంత్రాంగం దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం రూరల్

తెప్పోత్సవం



అంపోలులోని రాజరాజేశ్వరి సహిత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మూడో సోమవారం పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో సాయంత్రం ఆలయం పక్కనున్న చెరువులో తెప్పోత్సవను వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య అలంకరణ చేసిన పడవ వద్దకు తీసుకెళ్లారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని చెరువు ఒడ్డున దీపారాధన చేశారు.

– గార

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

అరసవల్లి: అరసవల్లి కాపువీధిలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయ సామగ్రి, బట్టలు, దుప్పట్లు, దోమతెర తదితర కిట్‌ను సోమవారం ఉదయం అందజేశారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి ఉంగటి రమణమూర్తి సమక్షంలో బాధితులకు ధైర్యం చెప్పారు. అలాగే సర్టిఫికెట్లు కోల్పోయిన డిగ్రీ విద్యార్థిని ఆర్.ధనలక్ష్మికి తిరిగి సర్టిఫికెట్లు ఎలా సంపాదించాలో అనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్వో కె.లీలాప్రసన్న, రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రమణ, ఏపీఆర్వో ఎస్.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో 1980–81లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 43 ఏళ్ల తర్వాత వాడాడలోని తరుణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు భవన్‌లో ఒకరినొకరు కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



హాజరైన ప్రకృతి వ్యవసాయ శిక్షకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ధనుంజయరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయ శిక్షకులు, ప్రచారకులకు ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మూడో రోజు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 75 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రస్తుతం 43 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అమలు చేసి సాగు చేస్తున్నట్లు చెప్పారు. నిమ్మతొర్లాడలో చెరకు పంట పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ తయారు చేసిన బెల్లం తిరుమల తిరుపతి దేవస్థానంకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పిక్కాట నిర్వాహకులపై కేసు నమోదు

గార: మండలంలోని మొగదాలపాడు తీరంలో పిక్కాట ఆడిస్తున్న 10 మందిని పట్టుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.71,200లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో మండలంలోని శ్రీకూర్మానికి చెందిన వ్యక్తితో పాటు పలు మండలాలకు చెందిన వ్యక్తులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.జనార్ధన తెలిపారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో 1 నుంచి 50వ డివిజన్ల వరకు ఈనెల 19వ తేదీ రెండో పూట నుంచి 20వ తేదీ సాయంత్రం వరకు రెండు రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిపివేయబడుతుందని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లిసిపురం జంక్షన్ వద్ద, బొందిలీపురం చేపల మార్కెట్ వద్ద ప్రధాన పైప్ లైన్ మరమ్మతులకి గురవ్వడంతో అంతరాయం కలుగుతోందన్నారు. ఈ విషయాన్ని నగర ప్రజలంతా గమనించి సహకరించాలని కోరారు.

ఇసుక వాహనాలు సీజ్



స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట సమీపంలోని నాగావళి నది నుంచి ఇసుక తరలించి పోగులు వేసి, అక్రమంగా ఆదివారం తరలిస్తుండగా ఎచ్చెర్ల పోలీసులు దాడిచేసి ఉపయోగిస్తున్న వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మూడు జేసీబీలు, రెండు ట్రాక్టర్లు, ఏడు లారీలు స్టేషన్‌కు తరలించారు. సోమవారం ఈ వాహనాలను మైన్స్ విభాగానికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని మైన్స్ డీన్ సీహెచ్ మోహన్‌రావు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు




మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాకేంద్ర గ్రంథాలయానికి అవసరమైన మౌలిక సదుపాయలు కల్పిస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా తనవంతు ఏదైనా కృషి చేయాలనే ఉద్దేశంతో గ్రంథాలయాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడం జరిగిందన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి ప్రభుత్వ పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన పంచాక్షరి



శ్రీకాకుళం కల్చరల్: గుడివీధి వద్ద నాగావళిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: కొన్నావీధిలోని భీమేశ్వరుడికి అభిషేకాలు



శ్రీకాకుళం కల్చరల్: ఆకాశ దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రణస్థలం: శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



జి.సిగడాంలో బారులుతీరిన భక్తులు



రణస్థలం: పైడిపేట శివాలయంలో భక్తుల రద్దీ



జి.సిగడాం: సేతు భీమవరంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివనామ స్మరణ మార్మోగింది. వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. పుణ్య స్నానాలు ఆచరించి శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళంలోని కోటేశ్వర ఆలయంలో భక్తుల దీపారాధన



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం శివాలయంలో భక్తుల తాకిడి